# మెషిన్ లెర్నింగ్‌తో కొత్త ఆవిష్కరణలు



ముఖ్యఅతిథులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలేజీ వైస్ చైర్మన్ హృదయ్‌రెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 22: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఆలోచనలను వెలికితీసేందుకు మెషిన్ లెర్నింగ్ సహకరిస్తుందని ఇన్ఫిస్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ ఎన్ రణధీర్‌రాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీలో అధునాతన టెక్నాలజీ మెషిన్ లెర్నింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ మధు నకిరేకంటి ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఉస్మానియా యూనివర్సిటీ, నిజాం కాలేజీతోపాటు గూగుల్ ఇండియా నుంచి నిపుణులు పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణలకు మెషిన్ లెర్నింగ్ ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని కళాశాల వైస్ చైర్మన్ అనంతుల హృదయ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్ పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన**




తుర్కయాంజాల్ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయాంజాల్, డిసెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా లోక్‌సభ, రాజ్యసభల్లో 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం తుర్కయాంజాల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఇచ్చిన పాసులతో పార్లమెంట్‌లోకి చొరబడి పొగబాంబులు వేయడం, బయట సైతం నిరసన తెలియజేయడంపై సమగ్ర విచారణ జరపాలని ఇండియా కూటమి సభ్యులు, వామపక్షాలు, ఇతర పార్టీ సభ్యులు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. దేశభక్తి గురించి గొప్పలు చెప్పే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు కనీస భద్రతపై నోరుమెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి కిషన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్‌కారత్, నాయకులు, శంకర్, సత్యనారాయణ, ఆశీర్వాదం, శారద, యాదగిరి, శంకరయ్య పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 22 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. శుక్రవారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డేవిడ్, మునీర్ పాషాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్ ఉన్నతి కార్యక్రమంలో భాగంగా పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయులకు భయాందోళన వాతావరణంలో పర్యవేక్షణ చేయడం వలన ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అలా చేయకుండా స్నేహపూరిత వాతావరణంలో పర్యవేక్షణ చేయాలని, అదేవిధంగా సీడబ్ల్యూఎస్ ఎన్ 26-9-2022 నుంచి 30-09-2022వరకు దసరా సెలవులలో శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సానుకూలంగా స్పందించారు.


# గణిత ఉపాధ్యాయులకు ఘన సన్మానం




ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 22 : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీ రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘం నాయకులు వర్కాల పరమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేశ్, స్వప్న, చెన్నారెడ్డి తదితరులున్నారు.

## ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 22 : మండలంలోని కవాడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి బదిలీపై అర్కపల్లికి వెళుతున్న సి.సుజాతకు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సమావేశానికి సర్పంచ్ దూసరి సుజాతాయాదయ్యగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై సుజాతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల నూతన ప్రిన్సిపాల్ దశరథరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్, వరప్రియ, ఉపాధ్యాయులు ప్రకాశ్, స్వర్ణలత, శ్రీనివాస్, గౌరి, రాములయ్య, చైతన్యభారతి, సుజాత, జావిద్, నాయకులు దూసరి యాదయ్యగౌడ్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.




### గురుకులాల్లో ప్రవేశానికి

# దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, డిసెంబర్ 22 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి రేణుక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి పాసైన విద్యార్థులు 06-01-2024లోపు ఆన్‌లైన్‌లో రూ.100 రుసులు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11-02-2024 రోజున ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 1842545678కి సంప్రదించాలని కోరారు.

**వీ-టీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి**

ఆమనగల్లు : గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి రేణుక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర సమాచారం కోసం హెల్ప్ లైన్ నంబరు 1842545678కు సంప్రదించాలని తెలిపారు.

## 18కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి, డిసెంబర్ 22: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని విశ్వసనీయ సమాచారం మేరకు మోకిల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోకిల ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇబ్రహీంబాగ్‌కు చెందిన మహావీర్‌సింగ్ (37) తన ఆటోలో 18 కేజీల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను పోలీస్‌స్టేషన్ తరలించి ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకున్న

## ఇద్దరు ఎంపీటీసీలు



కడ్తాల్, డిసెంబర్ 22: ఇటీవల తలకొండపల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీపీ నిర్మలపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ, కందుకూర్ ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను ఎంపీటీసీ సభ్యులు కలిసిన విషయం తెలిసిందే. 12 మంది ఎంపీటీసీ సభ్యులకుగానూ ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చౌదర్‌పల్లి, తలకొండపల్లి గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మాడ్గుల పెంటమ్మ, పెరుమాళ్ల హేమ... ఆర్డీవోను కలిసి అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఇచ్చిన పత్రాలను ఉపసంహంచుకున్నారు. దీంతో అవిశ్వాస తీర్మానానికి కావాల్సిన మెజార్టీ లేకపోవడంతో అవిశ్వాసం వీగినట్టయ్యింది.

## ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



ఆమనగల్లు, డిసెంబర్ 22 : పట్టణంలోని వెంకటగిరి పద్మావతీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## మహిళ హత్య కేసులో ఇద్దరికి జీవితకాల జైలు శిక్ష

నందిగామ, డిసెంబర్22: నందిగామ మండలం ఈదులపల్లి గ్రామానికి చెందిన అచ్చి ప్రవీణ్, అచ్చి జంగయ్య ఇద్దరు తండ్రి, కొడుకులు కలిసి బొల్ల రాజేశ్వరి(22)ని 2017 సంవత్సరంలో హత్య చేసిన కేసులో ఎల్‌బీనగర్ న్యాయ స్థానం విచారణ జరిపి శుక్రవారం అచ్చి ప్రవీణ్, అచ్చి జంగయ్యలకు జీవితకాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు నందిగామ సీఐ ఎన్.సురేశ్ తెలిపారు.

# లోక్ అదాలత్‌లో 160 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 22: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 160 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్సై విఠల్ రెడ్డి, కోర్టు, పోలీసులు సిబ్బంది మల్లేశ్, కవిత పాల్గొన్నారు.

## బైకును ఢీకొట్టిన కారు

**ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు**

కొత్తూరు, డిసెంబర్ 22: బైకును ఓ కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వై జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి వివరాలను శుక్రవారం వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం ఎల్కిచర్లకు చెందిన వెంకటేశ్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ వద్ద గల లైమ్‌స్టోన్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అయితే వెంకటేశ్ తన స్నేహితుడు సతీష్ గురువారం అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్నారు. కొత్తూరు వై జంక్షన్ వద్దకు రాగానే మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. వెంకటేశ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వెంకటేశ్ తండ్రి మడుగు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

## భార్యను కొట్టి చంపిన కేసులో భర్తకు జీవితకాల శిక్ష

కొత్తూరు, డిసెంబర్ 22 : భార్యను కొట్టి చంపిన కేసులో భర్తకు జీవితకాల శిక్ష రూ.10వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా డిస్టిక్ మెజిస్ట్రేట్ హరీష శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తలకొండపల్లి మండలం బలసుపల్లి గ్రామానికి చెందిన సేవ్య కోడలు సిద్ధాపూర్ గ్రామ పరిధిలోని చింతగట్టు తండాకు చెందిన సభావాత్ లక్ష్మణ్‌కు ఇచ్చి 2019 ఫిబ్రవరిలో వివాహం చేశారు. వివాహం అయిన నెల రోజుల నుంచి రజితను భర్త లక్ష్మణ్, వారి కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా హింసించడం మొదలుపెట్టారు. అయితే 2019 అక్టోబర్ 10న రజితను భర్త లక్ష్మణ్ కొట్టి చంపాడు. రజిత మామ సేవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నేరస్తుడిని అరెస్టు చేసి కోర్డులో చార్జ్‌షైల్ చేశారు. ఆ కేసులో ప్రాసిక్యూటర్ రఘు సాక్షాలను ప్రవేపెట్టారు. దీంతో శుక్రవారం లక్ష్మణ్‌కు జీవితకాల శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.